క్లుప్తంగా

మహా ప్రదర్శనను జయప్రదం చేయండి



ఎమ్మార్పీఎస్ ఆరుట్ల నూతన కమిటీ సభ్యులు

మంచాల: ఎమ్మార్పీఎస్ ఆరుట్ల గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా మంకు సురేష్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి సిద్దాపురం శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆరుట్లలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే నెల 7న నగరంలో జరిగే వెయ్యి గొంతులు–లక్ష డప్పులు మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు సంఘం కోసం కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు సుధాకర్, శంకర్, ప్రసాద్, వంశీ, శంకర్, ఆనంద్, నర్సింహ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫీజులు తగ్గించాలి

తుర్కయంజాల్: పెంచిన ఎంబీఏ సెమిస్టర్ పరీక్షల ఫీజులను వెంటనే తగ్గించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివ కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం తుర్కయంజాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెమిస్టర్ ఫీజు రూ.5వేలు వసూలు చేయడంతో పేద విద్యార్థులకు భారంగా మారిందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లను విడుదల చేయకుండా, సెమిస్టర్ ఫీజులను పెంచడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి


బూత్ కమిటీ అధ్యక్షులను సత్కరిస్తున్న విక్రంరెడ్డి

ఆమనగల్లు: మున్సిపాలిటీలో మరోసారి బీజేపీ విజయం సాధించాలని, ఇందుకోసం సమష్టిగా కృషి చేయాలని పార్టీ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఇటీవల ఎన్నికైన వారిని విక్రంరెడ్డి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతం కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, లక్ష్మణ్, రవిరాథోడ్, విష్ణుచారి, ప్రవీణ్ రెడ్డి, సాయిబాబా, అశోక్, శ్రీను పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి చేయూత


విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న నేతలు

ఆమనగల్లు: ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఓ విద్యార్థినికి తలకొండపల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శైలజ హైదరాబాద్‌లోని బీఎన్‌రెడ్డి నగర్‌లో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఆమె ఫీజు చెల్లించడానికి ఇబ్బందులు పడుతుండటంతో రూ.25 వేలను వెంకటేశ్ తరఫున నేతలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులుగౌడ్, మల్లేశ్, సంపత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ అండ్ నేషనల్ యూనిటీ అవార్డుకు ఎంపిక


మహేశ్

కడ్తాల్: బీజేపీ మండల అధ్యక్షుడు, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు కార్యదర్శి దోనాదుల మహేశ్ యూత్ అండ్ నేషనల్ యూనిటీ అవార్డు 2025కు ఎంపికయ్యారు. గురువారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో అవార్డు అందుకోనున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

చేవెళ్ల: ప్రజలు, వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. మండలంలోని దామరగిద్ద సమీపంలో మంగళవారం చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పాదాచారులు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. పాదాచారులు రోడ్లు దాటే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, జీబ్రా క్రాసింగ్‌ల వద్దనే రోడ్డుదాటాలని సూచించారు. వాహనదారులు అతి వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దన్నారు.

అసంపూర్తి పనులు..
తప్పని వెతలు


స్లాబ్ వరకే పరిమితమైన మండల పరిషత్ సమావేశపు హాల్


నిరుపయోగంగా జెడ్పీ అతిథి గృహం

- ప్రారంభానికి నోచుకోని జెడ్పీ అతిథి గృహ భవనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

యాచారం: అసంపూర్తి ఉన్న ప్రభుత్వ కార్యాలయ భవనాలతో యాచారం మండలవాసులు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న జెడ్పీ అతిథి గృహం ప్రారంభానికి నోచుకోలేదు. మరోపక్క మండల పరిషత్ సమావేశపు హాల్ స్లాబ్ వరకే నిర్మించి వదిలేశారు. ఈ రెండింటికి నిధుల లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మండల పరిషత్ సముదాయ ఆవరణలో జెడ్పీ అతిథి గృహ భవనం దిష్టి బొమ్మలా దర్శనమిస్తుంది. పాలకులు మారుతున్నా భవనం తలరాత మారడం లేదు. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో మండల కేంద్రంలో జెడ్పీ అతిథి గృహానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారు. పనులు నత్తనడకన సాగి ఐదేళ్ల కిందటే పూర్తయింది. చిన్న, చిన్న మరమ్మతులు చేసి భవనాన్ని ప్రారంభించాలి. కానీ ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదు. దీంతో భవనంలో ఉన్న ఫర్నిచర్, కిటికీలు, తలుపులు, ఇతర ముఖ్యమైన సామగ్రి శిథిలావస్థకు చేరుకొని విషసర్పాలకు నిలయంగా మారింది.

స్లాబ్ వరకే పరిమితం

మరోపక్క గత ప్రభుత్వ హయాంలో మండల పరిషత్ సమావేశాల కోసం ప్రత్యేకంగా హాల్ ఉండాలని రూ.50 లక్షల నిధులతో నిర్మాణ పనులు ప్రారంభించారు. అప్పట్లో రూ.20 లక్షలు ఖర్చు చేసి స్లాబ్ వరకే పనులు చేపట్టారు. పదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మండలంలో 24 గ్రామ పంచాయతీలు, 14 ఎంపీటీసీ స్థానాలు, మరో మూడు కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడే అవకాశం ఉండడంతో ప్రస్తుతం ఉన్న సమావేశపు హాల్ ఇరుకుగా ఉంటుంది. స్థానికులు జెడ్పీ అతిథి గృహం, మండల పరిషత్ సమావేశపు హాల్ నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేలా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్, వ్యవసాయ, ఈజీఎస్ తదితర కార్యాలయాల్లో వసతుల లేమి కొరవడింది. సరిపడా శౌచాలయాలు లేక ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

వసతులు కల్పించాలి



సర్కార్ భూ రిజిస్ట్రేషన్ల కోసం రూ.లక్షలాది ఫీజులు వసూల్ చేస్తోంది. కానీ తహసీల్దార్ కార్యాలయంలో కనీసం తాగునీటిని కూడా అందుబాటులో ఉంచరు. మూత్రశాలలు లేక పొలాలు, చెట్ల చాటుకు వెళుతున్నారు. వెంటనే అన్ని వసతులతో పాటు శౌచాలయాలు నిర్మించాలి.

– అంజయ్యయాదవ్, మాజీ సర్పంచ్, మొండిగౌరెల్లి

పనుల పూర్తికి కృషి



మండల కేంద్రంలో పదేళ్లుగా జెడ్పీ అతిథి గృహం ప్రారంభానికి నోచుకోకపోవడం వాస్తవమే. వెంటనే ఏఈఈని పంపించి ఏఏ పనులు చేయాలో నివేదిక తెప్పించుకుంటా. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో చర్చించి అతిథి గృహం వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తా.

– శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, పంచాయతీరాజ్

25 నుంచి సీపీఎం మహాసభలు

మాడ్గుల: సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలు విజయవంతం చేయలని ఆ పార్టీ మాడ్గుల కార్యదర్శి రమేష్ కోరారు. ఈ మేరకు మండలంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి పట్టణంలో సీపీఎం రాష్ట్ర మహా సభలు జరగనున్నాయన్నారు. ఇందులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ సభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు అంజయ్య, శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మండల కేంద్రంగా ప్రకటించాలని వినతి

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో జరిగిన సభలో పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. వెల్జాలను మండల కేంద్రంగా ప్రకటించి ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాదత్ అలీ, శేఖర్‌రెడ్డి, యాదగిరి, రాఘవేందర్, శ్రీశైలం గౌడ్, నిరంజన్‌గౌడ్, నర్సింహ తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

హామీలు అమలు చేయాలి

తుర్కయంజాల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నేటికి హామీలను అమలు చేయకపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య అన్నారు. మంగళవారం రాగన్నగూడలో వార్డు సభకు హాజరైన ఆయన.. గతంలోనే ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులను తీసుకున్నప్పటికీ, మరోసారి అర్జీలు చేసుకోవాలని చెబుతుండటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, నర్సింహ, శివ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

నేడు ఎమ్మెల్యే పర్యటన

కడ్తాల్: మండల కేంద్రంలో బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించనున్నట్లు డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంక్షేమ పథకాల అర్హుల ఎంపికకు స్థానిక రచ్చబండ వద్ద నిర్వహించనున్న గ్రామ సభకు ఎమ్మెల్యే హాజరవుతారని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామ కుమ్మరి సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడు నాగేశ్, కార్యదర్శి కుమార్, నాయకులు యాదగిరి, హనుమాన్‌ల ఆధ్వర్యంలో నూతన కమిటీని నియమించారు. ఖానాపూర్ గ్రామ కుమ్మరి సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా యాదయ్యను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సత్కరించారు.

పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెంచాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

కేశంపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుల సంఖ్యను పెంచాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమంలో పాల్గొని ఓపీని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రోగులతో ప్రేమగా ఉండాలని, గ్రామాల్లో బీపీ, షుగర్ రోగులకు మందులను అందించాలని సూచించారు. గర్భిణులకు హైరిస్క్ కాకుండా నార్మల్ డెలివరీ అయ్యే విధంగా చూడాలన్నారు. గర్భిణులకు పోషకాహారం గూర్చి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఉపేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మెర్సిలిన్, హన్మంతు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇక నుంచి షాద్‌నగర్ మీదుగా బస్సులు


సమావేశంలో మాట్లాడుతున్న బాబర్‌ఖాన్

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్

షాద్‌నగర్: పట్టణ శివారులోని బైపాస్ జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న పలు ఆర్టీసీ డిపోల బస్సులు ఇక నుంచి షాద్‌నగర్‌కు వచ్చి వెళ్తాయని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్, మహబూబ్‌నగర్ నుంచి ప్రయాణికులు బస్సులో షాద్‌నగర్‌కు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బైపాస్ నుంచి వెళ్లే బస్సులు షాద్‌నగర్ మీదుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బుధవారం నుంచి నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, కర్నూల్, కొల్లాపూర్ డిపోలకు చెందిన బస్సులు షాద్‌నగర్ డిపో మీదుగా వెళ్లనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ గిరిజన సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ రఘునాయక్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పారదర్శకంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటై చేస్తున్న డ్రామాలను ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశ్, నాయకులు ఖదీర్, రమేశ్, బచ్చలి నరేశ్, మహబూబ్ సయ్యద్, నరేశ్, శ్రీహరిగౌడ్, గంగనమోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

మహేశ్వరం: దొంగతనాల నివారణ కోసం వ్యాపారస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని మహేశ్వరం డివిజన్ ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి సూచించారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్‌తో కలిసి స్థానిక మండీ హోటళ్ల నిర్వాహకులతో సోమవారం రాత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండీ హోటళ్ల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ సమయానికి అనుగుణంగా నడుపుకోవాలన్నారు. హోటళ్ల ముందు పార్కు చేసిన వాహనాలు చోరీ కాకుండా విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి

షాద్‌నగర్: బీఆర్ఎస్ హయాంలోనే గ్రంథాలయాలు అభివృద్ధి చెందాయని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. షాద్‌నగర్‌లోని గ్రంథాలయాన్ని తామే నిర్మించామని కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సహకారంతో రూ.4కోట్లతో గ్రంథాలయానికి నూతన భవనాన్ని నిర్మించామన్నారు. అదేవిధంగా కేశంపేటలో రూ.10లక్షలతో గ్రంథాలయ భవనానికి మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. కొందుర్గులో భవన నిర్మాణం కోసం దాతల సహకారంతో స్థలాన్ని సమకూర్చినట్లు పేర్కొన్నారు. కొత్తూరు ఉమ్మడి మండలంలో ఉన్న గ్రంథాలయాన్ని కూడ తామే అభివృద్ధి చేశామన్నారు. అదేవిధంగా గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, విద్యార్థుల కోసం ఎన్నో పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను సమకూర్చామని, గత తొమ్మిదేళ్ల కాలంలో గ్రంథాలయాల అభివృద్ధి కోసం తాము ఎంతో కృషి చేశామన్నారు. సమావేశంలో గ్రంథాలయ కమిటీ మాజీ సభ్యులు అందె మహేశ్వర్, గాదె సుధాకర్, జంగరాజ్, అల్లాడ శేఖర్, గడ్డం ఆంజనేయులు, మహ్మద్ సలీం, జగన్, అబ్దుల్ రావుఫ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారెడ్డి

రాజకీయాలకు అతీతంగా జాబితా

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం గ్రామసభలను అధికారులు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఆయా గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రజలు పోటీ పడి అర్జీలు ఇచ్చారు.


ఇబ్రహీంపట్నం: చర్లపటేల్‌గూడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- ఇంటింటికీ వెళ్లి నిజమైన అర్హులను గుర్తించాలి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండలంలోని చర్లపటేల్‌గూడలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దరఖాస్తుదారుల ఇంటింటికి వెళ్లి ఆయా పథకాల నిజమైన అర్హుల జాబితాను రూపొందించాలన్నారు. నియోజకవర్గానికి ఈసారి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, మరో 500 ఇళ్లు అదనంగా తీసుకొస్తానన్నారు. పేదలకు న్యాయం చేయాల్సిన బాధ్యత గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, ప్రత్యేకాధికారి నవీన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుజాత, ఎంపీడీఓ వెంకటమ్మ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెల్జాలలో సింగిల్‌విండో ఏర్పాటు

ఆమనగల్లు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజాపాలన లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలంలో తలకొండపల్లి, వెల్జాల గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ప్రజలు ఇచ్చిన అవకాశంతో కల్వకుర్తిని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతామన్నారు. వెల్జాలలో నూతనంగా సింగిల్‌విండో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, భగవాన్‌రెడ్డి, రవీందర్‌యాదవ్ పాల్గొన్నారు.

తొలిరోజు ముగిసిన సభలు

ఇబ్రహీంపట్నం: డివిజన్ పరిధిలోని గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో నిర్వహించిన ప్రజాపాలన సభలు తొలిరోజు మంగళవారం ముగిశాయి. అక్కడక్కడ కొన్ని చెదురుమదురు సంఘటనలు చోటు చేసుకోగా పోలీసుల చొరవతో సద్దుమణిగాయి. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో 109 గ్రామ పంచాయతీల్లో, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, పెద్ద అంబర్‌పేట, తుర్కయంజాల్ మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఈ సభలు జరుగుతున్నాయి.

వినిపించిన నిరసన గళం

అబ్దుల్లాపూర్‌మెట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన గ్రామసభల్లో మండలంలో నిరసన గళం వినిపించింది. మండలంలోని మొత్తం 14 గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఒకటి రెండు గ్రామాలు మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రవేశపెట్టే పథకాల్లో అర్హులకు అన్యాయం జరిగేలా గ్రామసభలు నిర్వహిస్తున్నారని, పైరవీలు చేసుకునే వారికే పథకాలు దక్కుతాయని, అసలైన లబ్ధిదారులు, నిరుపేదలకు న్యాయం జరగదంటూ గ్రామసభల్లో అధికారులను నిలదీశారు. లష్కర్‌గూడ, గండిచెరువు గ్రామాల్లో గ్రామసభలను అడ్డుకునేందుకు పలువురు యత్నించగా పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను సముదాయించి గ్రామసభలు జరిగేలా చర్యలు తీసుకున్నారు.



ఆమనగల్లు: వెల్జాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


మంచాల: లింగంపల్లిలో నిర్వహించిన గ్రామ సభ


కడ్తాల్: అన్మాస్‌పల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ ముంతాజ్

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



చేవెళ్ల: మండలంలోని కేసారం గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు కొనసాగాయి. మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని గ్రామదేవతకు బోనాలు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. బోనాల వేడుకలకు గ్రామ నాయకులు, పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, నాయకులు అనంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఇంద్రాసేనా రెడ్డి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.